క్లుప్తంగా

అంబకంటిలో ఆర్డీవో విచారణ

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన ఓ రైతు తమ భూసమస్య పరిష్కరించాలని కోరుతూ ఇటీవల కుంటాల ప్రజాఫిర్యాదుల విభాగంలో దరఖాస్తు చేసుకున్నాడు. కాగా గురువారం భైంసా ఆర్డీవో కేవీబీ రవికుమార్ అంబకంటి గ్రామానికి వెళ్లి పలు వివరాలను సేకరించి విచారణ జరిపారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం'

నిర్మల్‌టౌన్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో గురువారం ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందులో ఎస్ఎన్ రెడ్డి, సాయి, అనంతరావు ఉన్నారు.

ఆదాయం పెంచుకోవాలి

కుంటాల: గ్రామపంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని డీఎల్‌పీవో శివకృష్ణ పేర్కొన్నారు. గురువారం కుంటాలలో ప్లాస్టిక్ రహిత సంచులను ఆవిష్కరించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, గ్రంథాలయం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సర్పంచ్ సమత, ఎంపీవో రహీం, కార్యదర్శి రాజాబాపు, సిబ్బంది దిలీప్ తదితరులు ఉన్నారు.

పోచమ్మకు సారె సమర్పణ



సారె సమర్పిస్తున్న వనితాశక్తి సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహనగర్ ఐదు చేతుల పోచమ్మ ఆలయంలో శైవక్షేత్ర వనితా శక్తి సంస్థ సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ మేరకు గురువారం పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలు నేటితరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఇలాంటివి చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో చందన, రోజా, సవిత తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ అప్పగింత

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలంకు చెందిన గంగన్న 15 రోజుల కిందట తన సెల్ పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టెక్నాలజీ సాయంతో ఫోన్ ఆచూకీ కనుక్కొని గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఎస్సై గంగాధర్, సిబ్బంది అందించారు.

నిర్మల్‌టౌన్: దస్తురాబాద్ గ్రామానికి చెందిన గొల్లపల్లి సురేశ్ ఈనెల 20న స్థానిక ఎంసీహెచ్ హాస్పిటల్‌లో ఫోన్ పోగొట్టుకున్నాడు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి కమ్మర్‌పల్లికి చెందిన యువకుడికి దొరికినట్లు కనిపెట్టారు. ఫోన్ రికవరీ చేసి బాధితుడికి తిరిగి అప్పగించినట్లు పట్టణ ఎస్సై గంగాధర్ తెలిపారు.

అన్నదాతలకు కష్టాలు




దిలావర్‌పూర్‌లో పంట ఆరబెడుతున్న రైతులు

దిలావర్‌పూర్: మండలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట ఇప్పటికే 50 శాతం చేతికి రాగా.. మిగతా పంట నూర్పిడి దశలో ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. బుధ, గురువారం కురిసిన భారీ వర్షంతో దిలావర్‌పూర్ మండలంలో అనేక మంది రైతుల మొక్కజొన్న పంట తడిసి ముద్దయింది. నువ్వు, పెసర, తదిత పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

పెంబి: ఇటీవల ఈదురుగాలులు, కురిసిన వర్షానికి రూ.ఐదు లక్షల విలువైన మామిడి పంట నష్టపోయానని మండల కేంద్రానికి చెందిన రైతు చాబంతి సహదేవ్ వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మంజులకు వినతిపత్రం అందించారు. సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కేంద్రం ప్రారంభిస్తున్న రైతులు

లోకేశ్వరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు పంట విక్రయించాలని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్‌లు రమణారెడ్డి, నరేశ్, వీడీసీ చైర్మన్ గంటగారి రాజారెడ్డి, బాయమొల్ల భోజన్న, గంగాధర్, రాజు, దిగంబర్, రాజేందర్ ఉన్నారు.

చెరువు మట్టితో ప్రయోజనం

- తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు
- భూమిలో చల్లుకుంటే నాలుగేళ్ల వరకు పోషకాలు
- మట్టి తరలింపులో రైతులు బిజీ బిజీ



కుంటాలలో చెరువు మట్టిని పొలంలో పోస్తున్న రైతులు

కుంటాల: కొన్నేళ్లుగా ఎండాకాలంలో చెరువుల్లో నీరు తక్కువగా ఉన్నప్పుడు అందులోని ఒండ్రు మట్టిని తీసి పొలాల్లో వేసుకుంటున్నారు. దీంతో రసాయన ఎరువుల వినియోగం, పెట్టుబడులు తగ్గి పంట దిగుబడులు పెరుగుతున్నాయి. వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తుండటంతో రైతులు సైతం ముందుకొచ్చి ఒండ్రు మన్నును తమ పొలాలకు తీసుకెళ్లి చల్లుకుంటున్నారు.

రసాయనాలతో తగ్గుతున్న దిగుబడులు..

అధిక దిగుబడులు సాధించాలనే ఆసక్తితో ఎక్కువగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో భూమి సహజ గుణం కోల్పోయి నిస్సారంగా మారుతోంది. దీంతో పెట్టుబడులు పెట్టినా ఆశించిన దిగుబడులు రావడం లేదు.

తరలించే ముందు భూసార పరీక్షలు తప్పనిసరి

చెరువు మట్టిని తరలించే ముందు తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించాలి. లవణ సాంద్రత 4 శాతం కంటే తక్కువ.. నీళ్లలో ఉదజని సూచిక 8.4 శాతం కంటే తక్కువ ఉన్నప్పుడు మాత్రమే చెరువు మట్టి వాడాలి. చెరువుల్లో పూడిక మట్టి రెండు నుంచి మూడు అడుగుల లోతు వరకు.. పరీక్షలు నిర్వహించిన తర్వాతనే తరలిస్తే పంటలకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

లాభాలివీ..

చెరువు మట్టి వినియోగంతో పంటలు సమృద్ధిగా పండుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు మట్టి 30 శాతం బంకమట్టి ఉంటాయి. తద్వారా పోషకాలు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలు అంది భూమి సారవంతంగా మారుతోంది. చెరువు మట్టి చల్లుకుంటే తెగుళ్లు ఆశించకుండా మిత్ర సూక్ష్మజీవులు చేరి పంటలకు మేలు చేస్తాయి. నీటిని నిలుపుకునే శక్తి 4 నుంచి 7 శాతం పెరిగి, రసాయనిక ఎరువుల వినియోగం 10 నుంచి17 శాతం వరకు తగ్గించుకోవచ్చు.

ఎకరాకు 20 నుంచి 25 ట్రాక్టర్లను తోలుకుంటే మంచిది. మట్టిని తరలించేందుకు మే నెల అనుకూలం. ప్రస్తుతం రైతులు పొలాలకు మట్టిని తరలించే పనుల్లో బిజీ బిజీగా కనిపిస్తున్నారు.

పెట్టుబడి తగ్గుతోంది



పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించా. అధిక దిగుబడులు రావడానికి ఏటా వేసవిలో పశువుల పేడ, చెరువు మట్టి చేనులో వేయిస్తున్నా. పెట్టుబడులు తగ్గడంతో రైతులకు మేలు జరుగుతోంది.

–రాజన్న, రైతు, కుంటాల

రెండేళ్లకోసారి తప్పనిసరి



అధికారుల సూచన మేరకు రెండేళ్లకోసారి చెరువు మట్టిని పొలంలో వేస్తున్నాం. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గింది. ప్రస్తుతం మంచి దిగుబడులు రావడంతో తోటివారికి కూడా చెబుతున్నా.

– కన్నం లక్ష్మణ్, రైతు, అందాకూర్

నాలుగేళ్ల వరకు పోషకాలు

చెరువు మట్టిలో విలువైన పోషకాలు ఉంటాయి. చెరువు మట్టి తరలించే ముందు భూసార పరీక్షలు తప్పనిసరి. ఒకసారి చెరువు మట్టి పొలంలో వేస్తే నాలుగేళ్ల వరకు పోషకాలు నిల్వ ఉంటాయి. దీంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చు. చెరువు మట్టితో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సోమలింగారెడ్డి, ఏవో, కుంటాల

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు

- నిర్మల్ పట్టణ సీఐ మల్లేశ్



నిర్మల్‌లో మాట్లాడుతున్న పట్టణ సీఐ మల్లేశ్

నిర్మల్‌టౌన్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ మల్లేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పట్టణ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 45 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు నెంబర్‌ప్లేట్ పెట్టుకోకున్నా, విరగొట్టినా, తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న పది మందికి డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ చేయించారు. ఇందులో పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, పలువురు సిబ్బంది ఉన్నారు.

ఊరికి వెళితే సమాచారం ఇవ్వాలి

ఖానాపూర్: ఊరికి వెళితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై ఆర్.శంకర్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవిలో పిల్లల విషయంలో బాధ్యతగా మెలగాలన్నారు. వీధుల్లో అనుమానితులు తిరిగితే సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

భైంసాటౌన్: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ముధోల్ సీఐ వినోద్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం బాసర మండలంలోని ఓని గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 88 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరాల నియంత్రణకే పోలీసులు పని చేస్తున్నారని..గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, పలువురు కానిస్టేబుళ్లు ఉన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాటం



వడ్యాల్‌లో మేడే పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

ఖానాపూర్: పోరాటాల ద్వారానే కార్మిక వ్యతిరేక కోడ్‌ల రద్దు సాధ్యమని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో గురువారం మే డే పోస్టర్ ఆవిష్కరించారు. వచ్చే నెల 1న జరిగే 138వ మేడే వేడుకలు జయప్రదం చేయాలన్నారు. రాజన్న, ఎల్లయ్య, మోహన్, నాగోరావు, మున్వర్, సుభాష్, లచ్చన్న తదితరులు ఉన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో మేడే పోస్టర్లను గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన ఆమట్లాడారు. కార్పొరేట్ యాజమాన్యాలకు తలొగ్గిన కేంద్రం 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. మేడే వారోత్సవాలను కార్మికులు ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇందులో కిషన్, సాయన్న, శంకర్, లింగన్న, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలు ప్రారంభించాలి

ఖానాపూర్: ప్రభుత్వం వెంటనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు యార్డులో పోసిన ధాన్యం కుప్పలు పరిశీలించారు. ఎమ్మెల్యే రేఖానాయక్ గతంలో క్వింటాల్ ధాన్యానికి ఐదు కిలోల చొప్పున తూకంలో కోత విధించారన్నారు. ఈసారి అటువంటి దోపిడీ మానుకోవాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బొమ్మెన సురేశ్, నాగెల్లి నర్సయ్య, నర్సయ్య, రాజేశ్వర్, మహేశ్, నర్సయ్య, బీరయ్య, లచ్చవ్వ, రాజవ్వ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

వ్యాధి నిరోధక టీకాలు

లక్ష్మణచాంద: వ్యాధి నిరోధక టీకాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పలువురు చిన్నారులకు టీకాలు వేశారు. లక్ష్మణచాంద పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మల్లాపూర్, పార్‌పెల్లి, లక్ష్మణచాంద ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

సారంగాపూర్: మండలంలోని హనుమాన్‌తండా గ్రామపంచాయతీలో నర్సరీ, అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ పరిశీలించారు. ఈసందర్భంగా పలు వివరాలను పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, సర్పంచ్ రాజేష్, తదితరులు ఉన్నారు.

వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ ముత్యాల పోచమ్మ ఆలయ సమీపంలో గురువారం వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా సంప్రదాయ పండుగల్లో ఒకటైన ముడుపుల పండుగను వీడీసీ నాయకులు నిర్వహించారు.

అంబలి పంపిణీ కేంద్రం ప్రారంభం

కడెం: మండలకేంద్రంలో నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ ప్రారంభించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ సతీశ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు స్టీఫెన్ తదితరులు ఉన్నారు.

అంత్యక్రియలకు సాయం

కడెం: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన చిలుకక్క అనే ఆదివాసీ మహిళ గురువారం మృతి చెందగా.. తక్షణ సాయంగా బీజేపీ నాయకులు రూ.రెండువేలు అందించారు. రవిగౌడ్, గంగారాం, క్రాంతి ఉన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన

తానూరు: రెండోవిడత గొర్రెల పంపిణీపై మండలంలోని కొలూరు గ్రామ రైతువేదికలో గురువారం పశువైద్యాధికారి గోపాల్ మహాజన్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ గతంలో డబ్బులు చెల్లించిన వారి వివరాలు సేకరించారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామడ: రెండో విడత గొర్రెల పంపిణీపై గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులతో అవగాహన కల్పించారు. లబ్ధిదారులు చెల్లించాల్సిన తమ వంతు వాటా వివరాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, సర్పంచ్ హన్మాగౌడ్, మండల పశువైద్యాధికారి ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

లక్ష్మణచాంద: రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ శిరీష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చింతల్‌చాందలో రైతులతో వారు మాట్లాడారు. కళాజాత సభ్యుడు రమేశ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బ్యాంక్ రుణాలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్యాంక్ సిబ్బంది చైతన్యరెడ్డి, పోషం, ఉదయ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్ మీదుగా బస్సు నడపండి

లోకేశ్వరం: భైంసా డిపో బస్సును మండలంలోని అబ్దుల్లాపూర్ నుంచి నందిపేట్ మీదుగా నిజామాబాద్‌కు నడపాలని అబ్దుల్లాపూర్ గ్రామస్తులు గురువారం భైంసాలో డిపో మేనేజర్ అమృతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, కన్కపూర్ సర్పంచ్ నరేశ్, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, గంగాధర్ ఉన్నారు.

కంటివెలుగు ప్రారంభం

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ రత్నమాల ప్రారంభించారు. ఎంపీవో మోహన్‌సింగ్, కార్యదర్శి వినయ్‌కుమార్, ఉపసర్పంచ్ సాయినాథ్, మారుతి, సిబ్బంది భాస్కర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఎంపీడీవో సురేశ్‌బాబు పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అయేషా, కార్యదర్శి సలావోద్దిన్, సాయినాథ్, రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని హనుమాన్‌తండాలో గురువారం సర్పంచ్ పవార్ రాజేశ్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం పలువురితో మాట్లాడి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాశ్, ఎంపీడీఓ సరోజ, దినేశ్, రాజు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

కుంటాల: మండలంలోని లింబా(కే)గ్రామంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువరాజ్‌మోరే, బౌద్ధ సొసైటీ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ గడపాలే, జనరల్ సెక్రెటరీ గంగాధర్, రాష్ట్ర సస్కర్ విభాగ్ ఉపాధ్యక్షులు నారాయణ వాగ్మారే, ఆనంద్‌రావు, లక్ష్మణ్‌చంద్రే, సర్పంచ్ ఆనంద్‌రావుపటేల్, ఎంపీటీసీ గిరీశ్‌కుమార్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, భూమన్న, గౌతమ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా మల్లారెడ్డి

కుంటాల: బీజేపీ ఐటీ, సోషల్ మీడియా జిల్లా జాయింట్ కన్వీనర్‌గా కసగిరి మల్లారెడ్డిని నియమిస్తూ జిల్లా కన్వీనర్ వెలిశాలి తిరుమలచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ముధోల్: మండలంలోని మచ్కల్ గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులను గురువారం సర్పంచ్ మైసాజీ ప్రారంభించారు. లబ్ధిదారులు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆత్మస్వరూప్, ముద్గల్ సర్పంచ్ రాంచందర్, ఏపీవో శిరీష తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. హోర్డింగ్ తొలగించరూ



కడెం: కడెం ప్రాజెక్టుకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన అటవీశాఖ ఏర్పాటు చేసిన హోర్డింగ్ ఇటీవల ఈదురుగాలులకు విరిగిపడింది. వారం గడుస్తున్నా బోర్డును తొలగించడం లేదు. హరిత రిసార్ట్స్, కడెం ప్రాజెక్టుకు నిత్యం ఈ మార్గంలో వందలాది మంది వచ్చి వెళ్తుంటారు. అధికారులు స్పందించి వాహనదారులకు ప్రమాదం జరగక ముందే బోర్డు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న విద్యుత్ అధికారి వెంకటేశ్

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఐదుగురు ఎంపీటీసీలతో పాటు ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను నామమాత్రంగా చదివి వినిపించారు. ఐసీడీఎస్ సీడీపీవో సరితకు బదులు సూపర్‌వైజర్ శ్రీలత హాజరుకావడంతో ఎంపీపీ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలోనూ సీడీపీవో పలు సమావేశాలకు హాజరుకాలేదని చెప్పడంతో ఐసీడీఎస్ నివేదిక వినిపించకుండానే సమావేశం ముగించారు. ఎర్రచింతల్ సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ ఎర్రచింతల్ గ్రామం నుంచి కొలాంగూడ గ్రామం వరకు ఆర్టీసీ బస్సు నడపాలని ఆర్టీసీ కంట్రోలర్ శంకర్‌నాయక్‌ను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఎంపీడీవో మల్లేశ్, తహసీల్దార్ రాజమోహన్ తదితరులు ఉన్నారు.

ప్రతీ కూలీకి పని కల్పించాలి



నివేదిక పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: పని కోసం వచ్చిన కూలీలందరికీ పని కల్పిస్తామని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో 1 జనవరి 2020 నుంచి 31 మార్చి 2023 వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులపై నిర్వహించిన 13వ ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. ఆ కాలంలో రూ.15కోట్ల 9లక్షల 29వేల 624 విలువైన పనులు జరిగాయన్నారు. ఉపాధిహామీ పనుల్లోఅవకతవకలకు పాల్పడితే చర్యలు ఉంటాయన్నారు. గుట్ట ప్రాంతంపై నాటిన మొక్కలను సంరక్షించినందుకు సిబ్బందిని ప్రశంసించారు. సిబ్బందికి రూ.22వేలు జరిమానా విధించగా, ఇందులో రూ.14వేల రికవరీకి ఆదేశించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, ఎస్ఆర్పీ కొండల్, ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, ఏపీసీ అంజగౌడ్, అంబురెమ్స్, నవీన్, విజిలెన్స్ అధికారి లక్ష్మణ్, ఎంపీడీవోలు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఏలేటి' పర్యటన



జామ్‌లో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: ఈసారి ఎన్నికల్లో నా కోసం పని చేసి గెలిపించండి..ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను కోరారు. మండలంలోని ఆలూరు, బోరిగాం, యాకర్‌పెల్లి, జామ్ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా బోరిగాం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ సిద్ధాపూర్ శేఖర్‌తో పాటు జామ్, యాకర్‌పెల్లి గ్రామాలకు చెందిన దాదాపు వంద మందికి పైగా యువకులు బీజేపీలో చేరారు. వారు మాట్లాడుతూ ఓటమి పాలైనా ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల మధ్యే ఉన్నానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు విలాస్, రాంశంకర్ రెడ్డి, చంద్రప్రకాశ్, ముత్యంరెడ్డి, గంగన్న, ఆర్‌వి రమణ, సాహెబ్‌రావు, మధు, శేఖర్, తిరుమలచారి, సత్యనారాయణ, ఎల్లన్న ఉన్నారు.

జామ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భర్త చెన్ను రాజేశ్వర్ గురువారం మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వార్డు సభ్యులు తాండ్ర అవేందర్, ద్యాగల నరేశ్ బీజేపీలో చేరగా మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దిలావర్‌పూర్: మండలంలోని బన్సపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మేకల నరేశ్, మాజీ సర్పంచ్ మేకల సునీత గురువారం బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. నాయకులు పీసరి శైలేశ్వర్, డి.ముత్యంరెడ్డి, జంగం వీరేశ్, పోల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూవెల్మల్‌లో పూజలు..

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సహపంక్తి భోజనం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, గంగన్న, ఎంపీటీసీ నాగయ్య, నర్సాగౌడ్, అర్జున్, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

భిక్షాటన చేస్తూ వీవోఏల నిరసన

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గురువారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. వీవోఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, నిర్మల్‌రూరల్ అధ్యక్షురాలు గాయత్రి, సింధు స్రవంతి, లక్ష్మి, గోదావరి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో వీవోఏలు ఆటోలు, కిరాణ దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు.

భైంసారూరల్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశీల, పరమేశ్, తదితరులున్నారు.

కుంటాల: కుంటాలలో వీవోఏలు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బక్కి మహేశ్, కార్యదర్శి గౌతమ్, గజ్జారాం, దేవన్న, సంపత్ పాల్గొన్నారు.

ముధోల్: వీవోఏల సమ్మెకు మద్దతుగా బీజేపీ నాయకులు పవార్ రామారావ్ పటేల్ దీక్షలో కూర్చొన్నారు. బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, బాలాజీపటేల్, యాదవ్‌రావు పటేల్, తదితరులున్నారు.

ఖానాపూర్: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. సురేశ్, నర్సయ్య, తిరుపతి, లావణ్య, గంగాధర్, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో వీవోఏల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు, సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.

కుభీర్: మండల కేంద్రంలో వీవోఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో వీవోఏల సంఘం మండల అధ్యక్షులు నాందేవ్, కార్యదర్శి సాయినాథ్, 40మంది వీవోఏలు పాల్గొన్నారు.

ముధోల్‌లో వర్షం

ముధోల్: మండలకేంద్రంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల వద్ద పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారు. భారీగా ఈదురుగాలులు వీచడంతో దుకాణాలు, పలు ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి.